క్లుప్తంగా

బదరీ కేదారేశ్వర ఆలయంలో విశేష పూజలు



కర్లపాలెం: అగ్రహారంలోని గంగా గౌరీ సమేత బదరీ కేదారేశ్వరస్వామి ఆలయంలో సోమవారం మహా అన్నదానం నిర్వహించారు. శివ స్వాముల 41 మండల దీక్ష ముగియడంతో ఆలయంలో చెన్ను జనార్దనరావు సోదరుల సహకారంతో మహా అన్నదానం చేశారు. సుమారు మూడు వేల మంది భక్తులు పాల్గొన్నారు. తొలుత బదరీ కేదారేశ్వరస్వామికి అర్చనలు, అభిషేకాలు, విశేష పూజలు జరిగాయి. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వినాయక, శివపార్వతులు, కుమారస్వామి చిత్రపటాలను పూల మాలలతో అలంకరించి అర్చనలు, విశేష పూజలు నిర్వహించి భజనలు చేశారు.

బాధితులకు పక్కా గృహాలు మంజూరు చేస్తాం



నగరం: అగ్ని ప్రమాదంలో ఇళ్లు కోల్పోయిన వారికి పక్కా గృహాలు మంజూరు చేయనున్నట్లు తహసీల్దార్ ఎం. శ్రీనివాసరావు చెప్పారు. మండలంలోని ధూళిపూడిలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో ఇళ్లు కోల్పోయిన వారితో సోమవారం ఆయన సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు ఆదేశాల మేరకు అగ్ని ప్రమాదాల బాధితులతో సమావేశమైనట్లు తెలిపారు. బాధితులకు పక్కా గృహాలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, వైఎస్సార్ సీపీ నాయకులు ఆనంద్, బాబూరావు పాల్గొన్నారు.

జగనన్న లేఅవుట్‌లో ప్రధాన రహదారి అభివృద్ధి




భట్టిప్రోలు: స్థానిక జగనన్న లేఅవుట్‌లో నిర్మాణ సామగ్రి తెచ్చుకునేందుకు లబ్ధిదారులు ఇబ్బందులు పడుతుండటంతో కలెక్టర్ ఆదేశానుసారం మండల పరిషత్ నిధులు రూ. 3 లక్షలతో రహదారిని అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టారు. సోమవారం ప్రధాన రహదారిపై గ్రావెల్ వేసి ట్రాక్టర్లు, లారీలు వెళ్లేందుకు వీలుగా పొక్లెయినర్‌తో చదును చేయించారు. పనుల్ని ఎంపీడీవో గుమ్మా చంద్రశేఖరరావు, పంచాయతీరాజ్ ఏఈ శేతు రామచంద్రరావు, సచివాలయ కార్యదర్శి పి. శ్రీనివాసరావు పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు దాపూరి నాగమల్లేశ్వరరావు, ఎం. మధు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వివాహిత మృతిపై కేసు నమోదు

రేపల్లె: వివాహిత మృతిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ విజయచంద్ర తెలిపారు. స్థానిక కార్యాలయంలో సోమవారం ఆయన వివరాలు తెలిపారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని బలరాంపురం జిల్లా కృష్ణాపూర్‌కు చెందిన మొహమ్మద్ ఆజం అతని భార్య సైమాభాను పట్టణంలోని 26వ వార్డులో కొంత కాలంగా నివాసం ఉంటున్నారు. ఇద్దరు సంతానం గతంలో చనిపోవడంతో అజం వేరే మహిళతో సంబంధం పెట్టుకుని వేధిస్తుండటంతో ఈ నెల 15న సైమాభాను ఎలుకల మందు తిని ఆత్మహత్యాయత్నం చేసింది. అప్పటి నుంచి విజయవాడలో ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందింది. మృతురాలి సోదరుడు జబీర్ ఆలీ ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ చెప్పారు.

ఐలవరంలో చోరీ



ఐలవరం(భట్టిప్రోలు): ఐలవరంలోని ఓ ఇంటిలో 15 సవర్ల బంగారాన్ని గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. ఎస్ఐ వై. సురేష్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కొతరపు లక్ష్మి ఇంటికి తాళాలు వేసి బంధువుల ఇంటికి వెళ్లారు. సోమవారం సాయంత్రం తిరిగి రాగా తాళాలు పగుల కొట్టి ఉన్నాయి. బీరువాలోని 15 సవర్ల బంగారం అపహరణకు గురైనట్లు నిర్ధారించుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ ఇంటిని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

'గడప గడపకు ప్రభుత్వం'తో ఊపందుకున్న అభివృద్ధి

- ప్రగతి పథంలో గ్రామాలు
- పలుచోట్ల సీసీ రోడ్ల నిర్మాణాలు



కొల్లూరు గౌడపాలెంలో నూతనంగా నిర్మించిన అంతర్గత సీసీ రోడ్డు



కొల్లూరు వెంకటేశ్వర థియేటర్ వద్ద నిర్మించిన సీసీ రోడ్డు

కొల్లూరు : అభివృద్ధికి ఆమడదూరంలో సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్న గ్రామాలు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంతో ప్రగతి పథం వైపు అడుగులు వేస్తున్నాయి. పల్లెల్లో దశాబ్దాల తరబడి పరిష్కారం అవని సమస్యల పరిష్కారమే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేపట్టిన ప్రతిష్టాత్మక కార్యక్రమం ద్వారా మౌలిక సదుపాయాలు ఒనగూరుతున్నాయి. కొల్లూరు మండలంలో 16 సచివాలయాలకు గాను 12 సచివాలయాల పరిధిలో రాష్ట్ర మంత్రి మేరుగ నాగార్జున గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గ్రామాలలోని ప్రతి ఇంటికీ వెళ్లారు. సమస్యల్ని తెలుసుకోవడంతో పాటు తన దృష్టికి వచ్చిన వాటి పరిష్కారానికి శ్రీకారం చుట్టారు. ఒక్కో సచివాలయానికి ప్రభుత్వం మంజూరు చేస్తున్న రూ. 20 లక్షలను సద్వినియోగం చేసుకుంటూ, గ్రామాల్లోని సమస్యల్ని ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తూ సంక్షేమంతో పాటు, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారు.

అంతర్గత రహదారులకు మోక్షం

గత టీడీపీ ప్రభుత్వం చిన్నచూపు కారణంగా సీసీ రోడ్ల నిర్మాణాలకు నోచుకోని ప్రాంతాల్లో నూతనంగా అంతర్గత రహదారుల నిర్మాణాలను చేపట్టి ప్రజా సమస్యల పరిష్కారానికి కొల్లూరు మండలానికి రూ. కోట్లలో నిధులు మంజూరయ్యాయి. మండలంలోని కొల్లూరు-1, కొల్లూరు-2, కొల్లూరు-3, ఈపూరులంక, చిలుమూరు, జువ్వలపాలెం, పెసర్లంక, రావికంపాడు సచివాలయాల పరిధిలో 35 సీసీ రోడ్ల నిర్మాణాలకు అధికారులు ప్రతిపాదనలు పంపగా, 30 వాటికి ఆమోదం లభించింది. రూ. 1.56 కోట్లతో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణ పనుల్లో మండల కేంద్రం కొల్లూరులో రూ. 38 లక్షలతో తొమ్మిది పూర్తయ్యాయి. మిగిలిన ఐదు సచివాలయాల పరిధిలో రూ. 1.18 కోట్లతో చేపట్టిన సీసీ రోడ్ల పనులు నిర్మాణ దశలో ఉన్నాయి. గ్రామాల్లో సమస్యల పరిష్కారమే దిశగా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనుల్ని వేగవంతం చేసేందుకు అధికార యంత్రాంగం చర్యలు చేపడుతోంది.

వేగవంతంగా అభివృద్ధి పనులు

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వెల్లువెత్తిన సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం మంజూరు చేస్తున్న నిధులతో గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతంగా పూర్తి చేయించేందుకు చర్యలు చేపడుతున్నాం. నిర్మాణ దశలో ఉన్న సీసీ రోడ్ల పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నాం.

– సేవానాయక్, పీఆర్ ఏఈ, కొల్లూరు

కులమతాలకు అతీతంగా సంక్షేమ పథకాల మంజూరు

- రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు
- కొత్తపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం



టీడీపీ నాయకులకు వైఎస్సార్ సీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎంపీ మోపిదేవి

నిజాంపట్నం: కులమతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక నాయకుడు ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు తెలిపారు. మండలంలోని కొత్తపాలెం పంచాయతీ నక్షత్రనగర్, సంజీవనగర్ గ్రామాల్లో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. మోపిదేవికి పూలవర్షం కురిపిస్తూ, బాణసంచా పేలుస్తూ ప్రజలు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాల్ని వివరించారు. ఒక్కో కుటుంబానికీ ప్రభుత్వం నుంచి చేకూరిన లబ్ధిని మహిళలకు వివరించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు లభిస్తున్నాయని తెలిపారు. కులం, మతం, పార్టీ చూడకుండా ప్రభుత్వ పథకాలు అందిస్తున్న ఏకైక నాయకుడు వై.ఎస్. జగన్ అని తెలిపారు. సంక్షేమ పథకాల అమలులో అవినీతికి తావు లేకుండా నేరుగా లబ్ధిదారుని ఖాతాలోనే నగదు జమ చేసి అవినీతిరహిత రాష్ట్రంగా తీర్చిదిద్దిన నాయకుడు జగన్ అని చెప్పారు. రాష్ట్రం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ ఇచ్చిన ఏ ఒక్క హామీని తప్పకుండా నెరవేరుస్తూ ముందుకు వెళుతున్న దమ్మున్న నాయకుడు జగన్ అని వివరించారు. తాను అధికారంలోకి వస్తే ప్రస్తుతం కొనసాగుతున్న సంక్షేమ పథకాల్ని ఎత్తి వేస్తానంటున్న చంద్రబాబుకు ఓటు అనే ఆయుధం ద్వారా ప్రజలు బుద్ధి చెప్పాలని మోపిదేవి తెలిపారు. ఎప్పుడు ఎన్నికలు జరిగినా జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకునేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కొక్కిలిగడ్డ రవి, జెడ్పీటీసీ సభ్యుడు నర్రా సుబ్బయ్య, ఎంపీపీ మోపిదేవి విజయనిర్మల హరనాథబాబు, ఎంపీటీసీ సభ్యులు గోపాలకృష్ణ, లంకె శ్రీనివాసరావు , మాజీ సర్పంచ్ రామాని కోటేశ్వరరావు, ఎంపీడీవో నాగలక్ష్మి, తహసీల్దార్ శిరీష, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరిన పలువురు టీడీపీ నేతలు

సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న పాలనను మెచ్చి ప్రజలు స్వచ్ఛందంగా వైఎస్సార్ సీపీలో చేరుతున్నారని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు తెలిపారు.నిజాంపట్నం మండలం కొత్తపాలెం పంచాయతీ నక్షత్ర నగర్, సంజీవనగర్ గ్రామాలకు చెందిన పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు సోమవారం వైఎస్సార్ సీపీలో ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు సమక్షంలో చేరారు. ఆయన వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

ప్రభుత్వ పనితీరు చూసి ఆశీర్వదించండి

ఎమ్మెల్యే కోన రఘుపతి



వృద్ధులకు నవరత్నాల పథకాల కరపత్రాలు అందజేసి వివరిస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల అర్బన్: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పనితీరును చూసి మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే కోన రఘుపతి ప్రజల్ని కోరారు. బాపట్ల మండలం నరసయ్య పాలెంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం నిర్వహించారు. గ్రామస్తులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే కోన రఘుపతితో పాటు అధికారులు ఇంటింటికీ వెళ్లి మూడేళ్లలో ప్రభుత్వ పనితీరును వివరించడంతోపాటు ముఖ్యమంత్రి సందేశంతో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశం మొత్తం గుర్తించే విధంగా సీఎం వై.ఎస్.జగన్ సచివాలయ వ్యవస్థతో సుపరిపాలన అందిస్తున్నారని కొనియాడారు. పేద ప్రజల అభివృద్ధి లక్ష్యంగా ఆయన విప్లవాత్మకమైన పథకాలు ప్రవేశపెట్టారని వెల్లడించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలే ప్రధానంగా వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజల్లోకి వెళ్తామని చెప్పారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో వంద శాతం ఇప్పటికే అమలు చేశామని తెలిపారు. కులం, మతం రాజకీయాలతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం వై.ఎస్.జగన్‌కే దక్కుతోందని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో పథకాలు మంజూరు కావాలంటే జన్మభూమి కమిటీలు చుట్టూ తిరగాల్సి వచ్చేదని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. అర్హత ఉంటే చాలు ఇంటి ముంగిటకే వస్తున్నాయని తెలిపారు. గ్రామంలో అంతర్గత రోడ్లు, మంచినీటి సదుపాయం , ఇళ్ల పట్టాలు, కరెంట్ స్తంభాలు సమస్యల్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వెంటనే పరిష్కారం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి, ఎంపీపీ చిన్న పోతుల హరిబాబు, వైఎస్సార్ సీపీ నా యకులు కల్లం హరినాథరెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మ న్ కృష్ణమూర్తి, వడ్డిముక్కల డేవిడ్, సొసైటీ ప్రెసిడెంట్ జయరామిరెడ్డి, సర్పంచ్ దాసి హైమావతి, ఎంపీటీసీ సభ్యురాలు దేవరపల్లి జయమణి, వీఆర్వో నాగకుమారి, రూరల్ ఎస్ఐ వెంకటప్రసాద్, సచివాలయం సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు పౌష్టికాహారం పంపిణీ



వెల్లటూరు(భట్టిప్రోలు): పదో తరగతి విద్యార్థులకు జెడ్పీ పాలకవర్గం పౌష్టికాహారం పంపిణీ చేయడం అభినందనీయమని ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయ భాస్కరి పేర్కొన్నారు. వెల్లటూరు జిల్లా పరిషత్ హైస్కూలులో ప్రతి రోజూ 79 మంది విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించే కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ లలిత కుమారి మాట్లాడుతూ విద్యార్థులు చదువుపై మరింత దృష్టి పెట్టి ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో అత్యుత్తమమైన ఆధునిక విద్య అందించేందుకు సీఎం జగన్‌మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారని ఆమె పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం జెడ్పీ పాలక వర్గం నిధులు మంజూరు చేయడంపై ప్రధానోపాధ్యాయులు కనపర్తి నిరీక్షణరావు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి చౌటూరి లక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు దారావత్ కుమారీబాయి, వాకా వెంకట నారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విధులను బాధ్యతతో నిర్వహించాలి



ఎంపీపీ శ్రీకృష్ణయ్యను సన్మానిస్తున్న గ్రామ సచివాలయ సిబ్బంది

నగరం: గ్రామసచివాలయ సిబ్బంది విధుల్ని బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య చెప్పారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం గ్రామ సచివాలయ సిబ్బందితో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఎంపీపీ పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల్ని అర్హులైన వారందరికీ అందించాల్సిన బాధ్యత గ్రామ సచివాలయ సిబ్బందిదేనని తెలిపారు. సమయ పాలన పాటించి, అంకిత భావంతో పని చేయాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీల్ని తర్వితగతిన పరిష్కరించాలని చెప్పారు. అనంతరం ఎంపీపీని గ్రామ సచివాలయ సిబ్బంది సన్మానించి, జ్ఞాపికను బహూకరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం. శ్రీనివాసరావు, ఎంపీడీవో ఎస్. రాధారమణ, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా బషీర్ బాబా గంధ మహోత్సవం

రెడ్డిపాలెం(కర్లపాలెం): శ్రీ హజరత్ బషీర్ బాబా 17వ గంధ మహోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా బాబా జెండాను భక్తులు భవనంవారిపాలెం, రెడ్డిపాలెం గ్రామాల్లో సన్నాయి మేళాలతో ఊరేగించారు. అనంతరం ఆశ్రమం వద్ద భక్తులకు గంధం, ప్రసాదాలతో పాటు అన్నదానం చేశారు. కార్యక్రమంలో పలు గ్రామాల నుంచి బషీర్‌బాబా భక్తులు పాల్గొన్నారు.

23న చెరుకుపల్లి మండల పరిషత్ సమావేశం

చెరుకుపల్లి: స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని గురువారం మధ్యాహ్నం రెండు గంటలకు ఎంపీపీ మత్తి దివాకర రత్నప్రసాద్ అధ్యక్షతన కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బి. శ్రీనివాసరావు తెలిపారు. సమావేశానికి ముఖ్య అతిథిగా రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు హాజరవుతారని ఆయన పేర్కొన్నారు. మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులు, జెడ్పీటీసీ సభ్యులు, కో- ఆప్షన్ సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొనాలని ఎంపీడీఓ కోరారు.

నేడు తెలుగు భాషోద్యమ సమాఖ్య వార్షికోత్సవం

తెనాలి: తెలుగు భాషోద్యమ సమాఖ్య ఆధ్వర్యంలో మంగళవారం విజయవాడలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం, సమాఖ్య 20వ వార్షికోత్సవం నిర్వహించనున్నారు. సమాఖ్య తెనాలి అధ్యక్ష, కార్యదర్శులు సామల లక్ష్మణబాబు, యర్రంశెట్టి హనుమంతరావు సోమవారం తెలిపారు. మొగల్రాజపురంలోని పీబీ సిద్ధార్థ కాలేజి సభా మందిరంలో మధ్యాహ్నం మూడు గంటలకు విద్యార్థుల కోసం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆచార్య గారపాటి ఉమామహేశ్వర రావు, ఆచార్య జోగాసింహ్(పంజాబ్), ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్ హాజరవుతారని వివరించారు. వ్యాసాలు, ప్రసంగాలు, లఘుచిత్రాలు-పోటీల ప్రకటన పోస్టర్ విడుదల చేయనున్నట్లు తెలిపారు. సాయంత్రం 5.30 గంటల నుంచి 'అమ్మ నుడి' సంపాదకీయాల సమాహారం' పుస్తకం ఆవిష్కరణ, వలగూడు (వెబ్‌సైట్)ను ఆవిష్కరించనున్నట్లు చెప్పారు.

స్పందన ఫిర్యాదులకు తక్షణ పరిష్కారం



రేపల్లెలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఏవో జాన్‌పీటర్

రేపల్లె: స్పందనలో ప్రజల నుంచి అందిన ఫిర్యాదుల్ని తక్షణం పరిష్కరించనున్నట్లు ఏవో జాన్‌పీటర్ తెలిపారు. స్థానిక రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో ఎనిమిది అర్జీలు అందినట్లు ఆయన చెప్పారు. నివేశన స్థలాలు ఇప్పించాలని రెండు, పట్టాదారు పాసు పుస్తకానికి ఒకటి, శ్మశానవాటికకు ప్రహరీ నిర్మించాలని ఒకటి, శ్మశానవాటికలో ఆక్రమణలు తొలగించాలని ఒకటి, బుద్ధం లంకలో డొంక రోడ్డును ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకుకోవాలని ఒకటి, పట్టణంలో టూవీలర్స్ అసోసియేషన్ కార్యాలయానికి స్థలం కేటాయించాలని ఒకటి, అడవులదీవి హెచ్‌పీ గ్యాస్ కంపెనీ పరిధిలో అనుమతులు లేకుండా ఇతర కంపెనీల గ్యాస్ విక్రయాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఒక అర్జీ అందిందని ఏవో వివరించారు. ఫిర్యాదుల్ని పరిశీలించి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

చెరుకుపల్లిలో రెండు అర్జీలు

చెరుకుపల్లి: ప్రజా సమస్యల్ని పరిష్కరించేందుకే ప్రభుత్వం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని తహసీల్దార్ టి. ప్రశాంతి తెలిపారు. కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో రెండు అర్జీలు అందాయి. గుళ్లపల్లి గ్రామానికి చెందిన బొర్రు శ్రీనివాసరావు నడిచే దారిలో అడ్డంగా గోడ కడుతున్నాడని, దాన్ని తొలగించాలని అదే గ్రామానికి చెందిన బొర్రు శ్రీరామ్మూర్తి, మోర్ల అప్పారావు రెండు అర్జీలు అందజేశారు. గోడ కడుతున్న ప్రదేశాన్ని వీఆర్వో, సర్వేయర్ పరిశీలించి సమస్యను పరిష్కరించాలని తహసీల్దార్ ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు వలంటీర్లు, గృహ సారథులకు శిక్షణ

కర్లపాలెం: స్థానిక పెద్దింటమ్మ అమ్మవారి కల్యాణ మండపంలో మంగళవారం ఉదయం వలంటీర్లకు, గృహ సారథులకు శిక్షణ ఇవ్వనున్నట్లు వైఎస్సార్ సీపీ కర్లపాలెం మండల అధ్యక్షుడు దొంతిబోయిన సీతారామిరెడ్డి, జీఎస్‌డబ్ల్యూఎస్ మండల కన్వీనర్ సమ్మెట వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. దుండివారిపాలెం, దమ్మనవారిపాలెం, యాజలి, బుద్ధాం, ఏట్రవారిపాలెం, పాతనందాయపాలెం, నల్లమోతువారిపాలెం, కర్లపాలెం గ్రామ సచివాలయాల పరిధిలోని వారికి ఉదయం 9.30 గంటలకు, సమ్మెటవారి పాలెం, పేరలి, పెదగొల్లపాలెం, తుమ్మలపల్లి, పెదపులుగువారిపాలెం, గణపవరం, చింతాయపాలెం గ్రామ సచివాలయాల పరిధిలోని వారికి 11.30గంటలకు శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

- చందోలు, సంగుపాలెం కోడూరు, కోమలి, భవనంవారిపాలెం, మంతెనవారిపాలెం, అల్లూరు, పిట్టువారిపాలెం, ఖాజీపాలెం, పిట్టలవానిపాలెం, పోతనకట్టవారిపాలెం, గోకరాజునల్లిబోయినవారిపాలెం గ్రామ సచివాలయాల పరిధిలోని వలంటీర్లకు, గృహసారథులకు మంగళవారం మధ్యాహ్నం 3గంటలకు చందోలు గ్రామ సచివాలయం వద్ద శిక్షణ ఇవ్వనున్నట్లు పిట్టలవానిపాలెం వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, ఎంపీపీ షేక్ బాజీ సోమవారం ప్రకటనలో తెలిపారు. శిక్షణ కార్యక్రమాలకు శాసనసభ్యుడు కోన రఘుపతి, జీఎస్‌డబ్ల్యూఎస్ రీజనల్ కో-ఆర్డినేటర్ కె.రవీందర్ రెడ్డి, నియోజక వర్గ పరిశీలకులు జి.బ్రహ్మారెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు.

నేడు వాలంటీర్లకు, గృహసారథులకు శిక్షణ


చందోలు(కర్లపాలెం): గ్రామ వాలంటీర్లకు, గృహసారథులకు చందోలు గ్రామ సచివాలయం వద్ద ఒకరోజు శిక్షణ కార్యక్రమం మంగళవారం జరగనున్నదని పిట్టలవానిపాలెం వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, ఎంపీపీ షేక్ బాజీ సోమవారం ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమానికి స్థానిక శాసనసభ్యులు కోన రఘుపతి, జీఎస్‌డబ్ల్యూఎస్ రీజనల్ కోఆర్డినేటర్ కె.రవీందర్‌రెడ్డి నియోజకవర్గ పరిశీలకులు జి.బ్రహ్మారెడ్డి హాజరవుతారని తెలిపారు.

టిప్పర్ యజమానులకు జరిమానా

తెనాలి రూరల్: నిబంధనలకు విరుద్ధంగా అధికలోడుతో ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ల యజమానులకు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) అధికారులు జరిమానా విధించారు. కొల్లిపరవద్ద తెనాలి ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ ఏవీ. చలం, సిబ్బంది ఆకస్మిక వాహన తనిఖీలను సోమవారం నిర్వహించారు. అధిక లోడుతో వెళుతున్న రెండు టిప్పర్‌లను గుర్తించి వాటి యజమానులకు రూ. 14వేల చొప్పున జరిమానా విధించారు.

మారిటైమ్ విద్యాసంస్థలో తెనాలి యువకుడికి సీటు

- ఇంటర్నేషనల్ లాజిస్టిక్స్, అండ్ పోర్ట్ మేనేజ్‌మెంట్‌లో ఎంఎస్సీ ప్రోగ్రాంకు అర్హత
- ఇప్పటికే మెరైన్ ఇంజినీరింగ్‌లో గ్రాడ్యుయేషన్



ఎరిక్ ప్రకాష్ వర్మ

తెనాలి: అందరిలా ఆ యువకుడు 'సాఫ్ట్‌వేర్'కేసి చూడలేదు. ఇంటర్నేషనల్ మారిటైమ్ ఆర్గనైజేషన్(అంతర్జాతీయ సముద్ర సంస్థ)లో జాబ్ లక్ష్యంగా పెట్టుకున్నాడు. ఆ దిశగా చదువు కొనసాగించాడు. కల నెరవేరేందుకు ఇంకొక్క అడుగు దూరంలోని మారిటైమ్ మేనేజ్‌మెంట్ స్కూల్లో సీటు సాధించాడు. అది కూడా... ప్రపంచంలో 20 ప్రతిష్టాత్మకమైన విద్యాసంస్థల్లో ఒకదానిలో సుమా! రెక్కలు కట్టుకుని విమానంలో అక్కడ వాలడమే తరువాయి. విదేశీ విద్యాదీవెన లభించి తన కల నెరవేరుతుందని ఆశతో ఉన్నాడు. ఆ యువకుడి పేరు ఎడ్ల ఎరిక్ ప్రకాష్ వర్మ. సొంతూరు తెనాలి. ఇంటర్ వరకు ఇక్కడే చదువు. కాంజీపురం(చెన్నై) ట్రిపుల్ ఐటీలో డిజైన్ అండ్ మాన్యుఫాక్చరింగ్‌లో మెకానికల్ ఇంజినీరింగ్ చేశాడు. ఆ వెంటనే కోల్‌కతాలోని డిఫెన్స్ షిప్ యార్డులో మెరైన్ ఇంజినీరింగ్‌లో గ్రాడ్యుయేషన్ 2020లో పూర్తయింది. అదే ఏడాదిలో ఆయిల్ అండ్ గ్యాస్ ఇంజినీరింగ్ చదువుకని స్కాట్లాండ్ వెళ్లాడు. కరోనా విపత్కర పరిస్థితుల కారణంగా కొన్ని నెలల్లోనే తిరుగుముఖం పట్టాల్సి వచ్చింది. అంతర్జాతీయ సముద్ర సంస్థలో ఉన్నతోద్యోగం లక్ష్యంతో అవసరమైన కోర్సులను అన్వేషించటం, ప్రపంచంలోని ప్రఖ్యాత విద్యా సంస్థలకు దరఖాస్తు చేస్తూ గడిపాడు. ఫ్రాన్స్ లోని లేహావ్రి నగరంలోని ఎం.నోర్మాండి బిజినెస్ స్కూల్‌లో ఇంటర్నేషనల్ లాజిస్టిక్స్, అండ్ పోర్ట్ మేనేజ్‌మెంట్‌లో ఎంఎస్సీ ప్రోగ్రాంకు సీటు లభించింది. మారిటైమ్ మేనేజ్‌మెంట్‌లో ఎం.నోర్మాండి బిజినెస్ స్కూల్ ప్రపంచంలోని 20 ప్రతిష్టాత్మక విద్యాసంస్థల్లో ఒకటిగా ఎరిక్ ప్రకాష్ వర్మ వివరించారు. యూ కే, యూరప్‌లో ఆరు క్యాంపస్‌లు ఉన్నాయని చెప్పా రు. ఇంతవరకు బాగానే ఉన్నా, వీసా, ప్రయా ణ ఖర్చులు, ఫీజులు, వసతి... అన్నీ కలిసి రూ.25– 30 లక్షల వరకు సమకూరటమే సమస్యగా తయారైందని అంటున్నాడు. ప్రైవేటు ఎయిడెడ్ కాలేజీలో అధ్యాపకుడిగా రిటైరైన తండ్రికి అంత స్తోమత లేదనీ, రాష్ట్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన విదేశీ విద్యాదీవెనతో తోడ్పడాలని విజ్ఞప్తి చేస్తున్నాడు.

ఘనంగా యోగ మండలి వార్షికోత్సవం



పేదలకు ఆహార పొట్లాలను అందజేస్తున్న ధ్యానయోగ మండలి సభ్యులు

బాపట్ల అర్బన్: శ్రీ ఆంజనేయం ధ్యాన యోగ మండలి బాపట్ల శాఖ స్థాపించి 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం జీబీసీ రోడ్డులోని చీదెళ్ల సత్యం బిల్డింగ్‌లో సోమవారం వేడుకలు నిర్వహించారు. ప్రకృతి ఉపాసన ధ్యానం కరపత్రాల్ని సీహెచ్. నాగేశ్వరరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యోగ సాధకులు శివాలయం, సాయి బాబా గుడి, రైల్వేస్టేషన్ సెంటర్లో పేదలకు ఆహార పొటాల్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో లక్ష్మణ్ , రవిబాబు, కోటేశ్వరరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

దళితవాడకు తాగునీటిని అందివ్వాలి

కొలకలూరు వాసుల విజ్ఞప్తి



కార్యదర్శి విద్యాసాగర్‌కు వినతిపత్రం అందజేస్తున్న శివసాంబిరెడ్డి

తెనాలిటౌన్: రూరల్ మండలం కొలకలూరు గ్రామంలోని దళితవాడకు కొత్త పైపులైన్‌లను ఏర్పాటు చేసి తాగునీరు అందించాలని ప్రజలు అధికారులను కోరారు. మంచినీటి పైపుల ద్వారా మురుగు నీరు వస్తున్నాయని, సోమవారం నందివెలుగు, గుంటూరు రహదారిపై గ్రామ సెంటర్‌లో గంటసేపు రాస్తారోకో చేశారు. రూరల్ ఎస్ఐ సి.హెచ్.వెంకటేశ్వర్లు సంఘటన స్థలానికి చేరుకుని రాస్తారోకో చేస్తున్న వారితో మాట్లాడారు. ఎస్ఐ ఫోన్ ద్వారా తహసీల్దార్ రవిబాబు, ఎంపీడీవో విజయా లక్ష్మణ్‌లతో మాట్లాడారు. సంఘటన స్థలానికి పంచాయతీ కార్యదర్శి పి.విద్యాసాగర్ చేరుకుని వారితో చర్చలు జరిపారు. కుళాయిలు బాగు చేయిస్తామని, మంచినీరు అందని వారికి ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేస్తామని హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు. కార్యక్రమంలో ఉన్నం జాన్‌బాబు, కోపల్లె శ్రీనివాసరావు, గొరికపూడి బుజ్జి, సుద్దపల్లి రవిబాబు, పంచాయతీ మెంబర్లు కొలకలూరి అరుణ, సాపాటి కోటేశ్వరి, మోదుకూరి దావీదు, సుద్దపల్లి స్వరూప, పోలంటి దాసు, సుద్దపల్లి పృథ్వి, కొలకలూరు సత్యనంద్ పాల్గొన్నారు.

అధికారుల పరిశీలన

గ్రామంలోని దళితవాడను ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు సందర్శించారు. తాగునీటి కుళాయిలను, మురుగునీరును పరిశీలించారు. అనంతరం జగనన్న కాలనీలను సందర్శించారు. గ్రామ సర్పంచ్ చొప్పరప్రీతి అధికారులకు త్రాగునీటి సమస్యను గురించి వివరించారు. జగనన్న కాలనీలో స్థలం చూపించినట్లయితే కొత్త ట్యాంక్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపిస్తామని అధికారులు తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సురేష్, డీపీవో కేశవరెడ్డి, డీఎల్‌పీవో శ్రీనివాస్ నాయక్, ఈవోపీఆర్డీ ప్రభాకర్, పంచాయతీ కార్యదర్శి విద్యాసాగర్‌లు ఉన్నారు.